# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

ఏప్రిల్ 20, 2013

## భూసేకరణ బిల్లుకు వ్యతిరేకంగా పోరాడండి!
## జల్, జంగల్, జమీన్‌లపై హక్కు కోసం పోరాటాల్ని తీవ్రతరం చేస్తూ, మన భూముల్ని గుంజడానికి సామ్రాజ్యవాదులు–దళారీ నిరంకుశ పెట్టుబడిదారులు–బడా భూస్వాములు చేస్తున్న కుట్రలను ఓడించండి!
## సిసలైన భూసంస్కరణలే నేటి అవసరం, భూసేకరణ కాదు!

ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లో మన కాళ్ల కింది నుండి భూమిని లాగేయడానికి అన్ని సన్నాహాలు పూర్తయ్యాయి. మన దేశంలో కోట్లాది రైతులు నేలతల్లిగా కొలిచే ప్రధాన ఉత్పత్తి సాధనమైన భూమి, తరతరాలుగా ఉపాధిని కల్పిస్తున్న, మరెన్నో తరాలకు కల్పించాల్సిన భూమి. మన దేశాన్ని బ్రిటిష్‌వాళ్లు ఆక్రమించుకున్న వలసకాలం నాటి అత్యంత అమానవీయమైన, క్రూరమైన భూకబ్జాలకు బూటకపు చట్టపరమైన ముసుగును తొడిగిన 'భూసేకరణ చట్టం, 1894' పైపై మెరుగులకు సిద్ధమైంది. పైపైన అనేది ఎందుకంటే దాని సారం, ఉద్దేశాలు మారలేదు. నాడు వలసవాదులు మన దేశ సంపదలను దోచుకు పోవడానికి అది దోహదపడితే, నేడు సామ్రాజ్యవాదులకు అదే పని కోసం దోహదపడుతుంది. ఇక మెరుగులు అనేవి 'న్యాయమైన నష్టపరిహారం, పారదర్శకత, పునరావాసం' లాంటి ముసుగుల్ని తగిలించుకుని వలసకాలం నుండి భూకబ్జాలకు మిగిలిపోయిన అడ్డంకులన్నిటినీ తొలగించే కార్యక్రమాన్ని చేపడతాయి. 1947 నామమాత్ర అధికార మార్పిడి తర్వాత వలసకాలం నుండి ఉన్నదున్నట్టుగా అన్వయించుకున్న లేదా సవరణలు చేసిన ఆర్థిక వ్యవస్థ సంబంధిత చట్టాలన్నీ ఆయా దశల్లో సామ్రాజ్యవాదుల, దళారీ నిరంకుశ బూర్జువాల అంతర్జాతీయ, దేశీయ అవసరాలను అనుసరించే జరిగాయి. ఇప్పుడు ప్రతిపాదిస్తున్న భూసేకరణ బిల్లు కూడా అందుకు అతీతం కాదు. యుపిఎ–2 'ప్రతిపక్ష పార్టీ'ల పరోక్ష మద్దతుతో త్వరత్వరగా తీసుకువస్తున్న, కార్పొరేట్ మీడియా పెద్దెత్తున హోరెత్తిస్తున్న 'బిగ్ బ్యాంగ్' సంస్కరణల వరుసలో ఇటీవలిదే 'కాలం చెల్లిన' 'భూసేకరణ చట్టం, 1894' స్థానంలో తీసుకువస్తున్న ఈ 'న్యాయమైన నష్టపరిహార హక్కు, భూసేకరణలో పారదర్శకత, పునరావాసం బిల్లు, 2012'.

తాము ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభం నుండి త్వరత్వరగా బయటపడాలని చూస్తున్న సామ్రాజ్యవాదులు భారత పాలకవర్గాలను 'ఇంకా త్వరగా, ఇంకా త్వరగా' అని తొందరపెడ్తూ కొరడాలు ఝుళిపిస్తుండగా, వారికి అత్యంత నమ్మకమైన ఏజెంట్లయిన ప్రధాన మంత్రి, ఆర్థికశాఖ మంత్రి, గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి 2012 సెప్టెంబర్ సంస్కరణల తర్వాత మరిన్ని త్వరలోనే తెస్తాం అని ఊదరగొట్టారు. చెప్పినట్టుగానే అనేక సంవత్సరాల మంతనాల తర్వాత భూసేకరణకు సంబంధించిన ఈ బిల్లును ఇప్పుడు పార్లమెంటు అనే ప్రహసనంలో ప్రవేశపెడుతున్నారు. ఈ మంతనాల ఉద్దేశం దోపిడీదారుల మధ్య ఎంత బాగా భూకబ్జాలను చేయాలనే విషయంలో ఏకాభిప్రాయం సాధించడం, ప్రజలను 'ప్రజాస్వామిక ప్రక్రియ' గురించి మోసగించడం తప్ప మరేమీ కాదు.

పేరులోనే ఉన్నట్టు ఈ బిల్లు ఉద్దేశం 'అభివృద్ధి' కోసం అంటే భారత పాలకవర్గాల భాషలో పెద్ద మైనింగ్ ప్రాజెక్టులు, పెద్ద ఆనకట్టలు, ప్రత్యేక ఆర్థిక మండళ్లు, హైవేలు, విమానాశ్రయాలు, రైల్వేలు, మిలటరీ కట్టడాలు వగైరా కోసం ప్రజల భూమిని సేకరించడం. నిజానికి, ఈ ప్రక్రియ 1947 నామమాత్ర అధికార మార్పిడి తర్వాత నుండే కొనసాగుతున్నా (నెహ్రూ ఆధునిక దేవాలయాలుగా అభివర్ణించిన పెద్ద ఆనకట్టలూ, ఇప్పటికీ నష్టపరిహారం అందకుండా మిగిలిపోయిన వాటి బాధితులూ మనకు తెలుసు), 1991 నాటి మొదటి తరం నయా వుదారవాద సంస్కరణల తర్వాత అది ఊపందుకుంది. న్యాయమైనది కాదు కదా, దాదాపుగా ఎటువంటి నష్టపరిహారమూ లేకుండా, సరైన పునరావాసం లేకుండా, నిర్ణయాల్లో ఎటువంటి పారదర్శకత, ప్రజల భాగస్వామ్యం లేకుండా ప్రభుత్వమూ, ప్రైవేటు పెట్టుబడి చేస్తూ వచ్చిన భూసేకరణ చరిత్రంతా ఒక అల్లకల్లోల చరిత్రే. ఒక అంచనా ప్రకారం 10 కోట్లమంది నిర్వాసితులు కాగా, పునరావాసం రేటు అతి ఘోరంగా 17 నుండి 20 శాతంగా వుంది. జీవనోపాధి కోల్పోవడం వల్లా, విస్థాపనకూ, మన దేశ సహజ సంపదలను అప్పనంగా బహుళజాతి కంపెనీలకు అప్పగించడానికీ వ్యతిరేకంగా పోరాడిన ప్రజలపై అమలైన రాజ్యహింసలోనూ ఎందరో ప్రాణాలు కోల్పోయారు. 'అభివృద్ధి' పట్ల భ్రమలు పూర్తిగా తొలగిపోయాయి. నిరాహార దీక్షలు మొదలుకొని సాయుధ పోరాటం దాకా వివిధ స్థాయిల్లో విస్థాపనకూ, 'అభివృద్ధి'కీ వ్యతిరేకంగా ప్రజాపోరాటాలు దేశవ్యాప్తంగా పెల్లుబుకడం, విస్తరించడంతో ఈ ప్రక్రియకు బ్రేకులు పడడం మొదలయ్యింది. ఈ నేపథ్యంలోనే పై బిల్లును తయారు చేసి చట్టంగా మార్చడానికి అన్ని సన్నాహాలు పూర్తి చేశారు.

'ప్రజాప్రయోజనం' పరిధిని చాలా విస్తరించేసి అందులో వ్యవసాయ సంబంధిత, వ్యవసాయ ప్రాసెసింగ్, కోల్డ్ స్టోరేజి, పారిశ్రామిక కారిడార్లు లేదా మైనింగ్ కార్యకలాపాలు, జాతీయ పెట్టుబడులు, జాతీయ ఉత్పత్తి విధానంలో నిర్వచించిన లాంటి ఉత్పత్తి జోన్లకు సంబంధించిన అన్ని వ్యవస్థాపనా ప్రాజెక్టులు లేదా కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో నోటిఫికేషన్ పెట్టిన మరే వ్యవస్థాపనా సౌకర్యాలనైనా దానిలో చేర్చడం ద్వారా ఈ బిల్లు బహుళజాతి కంపెనీలకు భూమిని సేకరించడానికి తలుపులు బార్లా తెరిచేసి మిగిలిన కొద్దిపాటి స్వయం ప్రతిపత్తి, సార్వభౌమత్వాలను కూడా లేకుండా చేసేస్తోంది. మన దేశంలో భూమి మీద ఆధారపడిన కోట్లాది రైతాంగంతో పాటు, ఏ మాత్రం భూమిలేని కొన్ని కోట్లమంది ప్రజలు కూడా ప్రత్యక్షంగా, పరోక్షంగా దాని మీద ఆధారపడి బతుకుతున్నారు. సారవంతమైన భూములను నష్టపోవడం వల్ల వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు కూడా దెబ్బ తింటాయి. కాబట్టి ఈ బిల్లు కేవలం రైతాంగ కుటుంబాలనే కాక ఈ పరిశ్రమల మీద ఆధారపడిన కార్మికుల జీవితాలను కూడా ఛిన్నాభిన్నం చేస్తుంది.

ప్రైవేటు కంపెనీలు భూమిని ఉపయోగిస్తే 80 శాతం భూయజమానుల, ప్రభుత్వ-ప్రైవేట్ పార్ట్నర్‌షిప్ కోసం భూమిని సేకరిస్తే 70 శాతం భూయజమానుల ఆమోదం అవసరం అని ఈ బిల్లులో వుంది. కనీసం బాధిత కుటుంబాలన్నిటి ఆమోదం అవసరం అనేది కూడా లేకుండా కేవలం భూమిని కోల్పోయిన వారి ఆమోదం వుంటే సరిపోతుందన్నది. గత ఘోరమైన చరిత్రను చూసినపుడు, ఈ 'అనుమతి' వ్యవహారం ఎంత హాస్యాస్పదంగా మారిపోతుందో ఊహించచ్చు. 100 శాతం ప్రజల ఆమోదం లేకుండా 80 శాతం, 70 శాతం ప్రజల ఆమోదం ఎలా సరైంది? వీటి ద్వారా కలిగే దుష్పరిణామాల గురించి ప్రజలకు ఎంతవరకు చెప్తారు? ప్రజల్ని అజ్ఞానంలో వుంచడానికి ఎన్ని తప్పుడు సమాచార క్యాంపెయిన్‌లు నడుస్తాయి? దళారులకు ఇచ్చే లంచాల శాతం ఎంత, బలవంతంగా వత్తిడితో ఆమోదం తీసుకునే శాతం ఎంత? పోలీసు, పారామిలటరీ, ప్రత్యేక బలగాలు ప్రయోగించే హింస ఏ స్థాయిలో వుంటుంది? ప్రతి రాష్ట్రంలోనూ ఈ ప్రశ్నలకు సమాధానాలు ప్రజలకు అత్యంత పీడాకరంగా వుండినాయి. వారికి ఈ మోసం బాధాకరంగా తేటతెల్లమైంది.

అనేక పంటలు పండే సాగుభూమి సేకరణ పరిమితి ఎంత వుండాలి అనేది ఆయా రాష్ట్రాల ప్రత్యేకతలనూ, పరిస్థితులనూ దృష్టిలో వుంచుకుని నోటిపై చేయడానికి ప్రభుత్వానికి ఈ బిల్లు విచ్చలవిడి అధికారాలను కట్టబెడుతున్నది. సామ్రాజ్యవాద-దళారీ నిరంకుశ పెట్టుబడికి కావల్సినన్ని ఎకరాల అనేక పంటలు పండే సాగుభూముల్ని సేకరించుకోగలిగే సౌకర్యాన్ని ఇది కలిగిస్తుంది. పెసా, అటవీ హక్కుల చట్టాలను స్పష్టంగా ఉల్లంఘిస్తూ గ్రామసభలన్నిటిలో కాకుండా, కేవలం 25 శాతం కంటే ఎక్కువ భూమలను సేకరించే గ్రామాల్లో, మున్సిపాలిటీల్లో మాత్రమే పునరావాస ముసాయిదాపై బహిరంగ విచారణ వుంటుంది అని చెప్తోందీ బిల్లు. పునరావాస పథకానికి సంబంధించిన ప్రకటనను ఆలస్యం చేసే అధికారాన్ని కూడా ఈ బిల్లు ప్రభుత్వానికి కట్టబెడుతుంది. రైతులకు ఇచ్చే నష్టపరిహారం లక్షల రూపాయల్లో, భూమిని తిరిగి అమ్మే రేటు కోట్ల రూపాయల్లో వుంటున్నదంటే బలవంతంగా తమ భూముల్ని అమ్ముకోవాల్సి వచ్చే రైతుల దుస్థితిని మనం ఊహించచ్చు. లక్షాధికారులు కోటీశ్వరులు అవుతుంటే ఒకప్పటి స్వతంత్ర భూయజమానులు దరిద్రులుగా మారిపోతున్నారు. ఈ బిల్లులోని అత్యంత ప్రమాదకరమైన ప్రతిపాదనల్లో ఒకటి ఏంటంటే ఐదేళ్ల వరకు ఉపయోగించకుండా వుంటే ఆ భూమిని ఆ భూమి యజమానికి కాక ప్రభుత్వ భూబ్యాంకుకి బదిలీ చేయాలనేది. ఈ చర్య పెద్దెత్తున భూసేకరణకు దారి తీసి, తర్వాత వాటిని చట్టవిరుద్ధంగా బహుళజాతి కంపెనీలకు అప్పగించే అవకాశాన్ని ప్రభుత్వానికి ఇస్తుంది.

పట్టణ ప్రాంతాల్లో పెద్దెత్తున పేదవారినీ, మధ్యతరగతి వారినీ కూడా వారి ఆవాస ప్రాంతాల నుండి తొలగించివేయడం మామూలైపోయింది. అర్బన్ సీలింగ్ చట్టాలను తమకనుకూలంగా, ఊసే లేకుండా చేశారు. ఈ బిల్లు కనుక ఆచరణలోకొస్తే ఇప్పటికే మోయలేని భారంతో ఉన్న పట్టణ ఉద్యోగిత పెద్దెత్తున జరిగే గ్రామీణ వలసల వల్ల మరింతగా కుంగిపోతుంది. ఇది సామ్రాజ్యవాద-దళారీ పెట్టుబడి జోడీ ప్రయోజనాలకు సరిపడేదే. ఎందుకంటే 2007 చివరి నుండి తాము కూరుకుపోయిన ఆర్థిక సంక్షోభం నుండి బయటపడి గుత్త లాభాలను సంపాదించడానికి కార్మికుల వేతనాలను ఎంతగా వీలైతే అంతగా తగ్గించడానికి వారికి పెద్దెత్తున నిరుద్యోగ రిజర్వు సైన్యం వుండడం అవసరం. ఈ బిల్లు ఈ పార్లమెంటరీ పందికొక్కులు తలకెత్తుకునే వారి స్వంత రాజ్యాంగం ఇస్తున్న పని, జీవనోపాధి, విద్య, ఆహార, ఓటు వంటి మౌలిక హక్కులకు కూడా భంగకరమే. ఇది భూమిపై ఆధారపడి జీవించే వారందరి ఆహార, జీవనోపాధి రక్షణలపై తీవ్ర ప్రభావాన్ని కలిగిస్తుంది. ఇది ప్రాంతీయ అసమానతలనూ, ధనిక-పేద అంతరాన్నీ, పట్టణ-గ్రామీణ అంతరాన్నీ తీవ్రంగా పెంచివేస్తుంది. ఇది లాంఛనప్రాయమైన ఫెడరల్ వ్యవస్థకు కూడా హానికరంగా మారి, రాష్ట్రాల అధికారాలను తగ్గించి ఫాసిస్టు అధికారాలు మరింత కేంద్రీకృతం కావడానికి దారి తీస్తుంది.

1947 నుండి అత్యధిక కాలం కాంగ్రెస్ పార్టీ లేదా దాని నాయకత్వంలోని సంకీర్ణ ప్రభుత్వాలే అధికారంలో వుండినాయి. భూకబ్జాలకు అదే నాయకత్వం వహించి కోట్లాది కార్మికుల్నీ, రైతాంగాన్నీ, ఇతర పీడిత వర్గాలనూ, దళితులు, ఆదివాసులూ, మహిళలూ, మైనారిటీలు వంటి పీడిత సామాజిక సెక్షన్లనూ, వెనుకబడిన ప్రాంతాలనూ అణచివేస్తూ, విస్థాపితుల్ని చేస్తూ వచ్చింది. ఇతర పార్లమెంటరీ పార్టీలూ తక్కువ తినలేదు. ప్రతి ఒక్క పార్టీ నిర్వాసిత ప్రజల క్రోధానికి గురయ్యే వుంది. తమ సామ్రాజ్యవాద యజమానుల పట్ల విశ్వాసం అనే ఏకసూత్రంతో బంధించబడిన ఈ పార్టీలన్నీ త్వరత్వరగా ఏకమై ఈ బిల్లును ఆమోదించడానికి అంగీకారానికి వచ్చాయి.

ప్రతిపక్ష పార్టీల సవరణలు, 'అభ్యంతరాలు' అనేక పంటలు పండే వ్యవసాయ భూముల్ని సేకరించరాదు (సమాజ్‌వాది పార్టీ) అనడం నుండి అసలు ప్రభుత్వం భూసేకరణలో ఎటువంటి జోక్యం చేసుకోరాదు (తృణమూల్ కాంగ్రెస్) అనే వరకే వున్నాయి. ఎన్‌జీవోల సూచనలూ,

అభ్యంతరాలూ జీవనోపాధి ఆధారిత పునరావాసం, 100 శాతం బాధిత/విస్థాపిత ప్రజల ఆమోదం, గ్రామసభల భాగస్వామ్యం, పట్టణ తొలగింపులను చేర్చడం, సరైన పునరావాసం వంటి వాటి చుట్టూ వున్నాయి. అత్యంత పాక్షికంగా, విడివిడిగా ఈ అభ్యంతరాలు ప్రతిపాదిత బిల్లులోని కొన్ని మౌలిక లోపాలను ఎత్తిచూపినప్పటికీ వాస్తవంగా చూసినప్పుడు ఇవి జల్లెడ నుండి ఉధృతంగా పారుతున్న నీటిని పట్టించుకోకుండా, దాన్లోని ఒకటి, రెండు చిల్లుల్ని ఎత్తిచూపినట్టుగానే ఉంటాయి.

కేంద్రంలోనూ, రాష్ట్రాల్లోనూ అధికారంలో వుండిన, వున్న పార్లమెంటరీ పార్టీలన్నీ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పెద్దెత్తున భూకబ్జాలు చేయడానికీ, భూ మాఫియాలను పెంచి పోషించడానికీ, వాటిని ఉపయోగించి రైతాంగాన్ని, ముఖ్యంగా ఆదివాసులనూ, పట్టణ పేదలనూ బలవంతంగా భూముల నుండి బేదఖల్ చేయడానికీ, విస్థాపనను వ్యతిరేకించే ప్రజలను అణచడానికి రాజ్య యంత్రాంగాన్ని సంపూర్ణంగా ఉపయోగించడానికీ కుఖ్యాతి గాంచినవే. ఎంతో కొంత హోదా వున్న ఈ పార్టీల నాయకుల్లో భూకబ్జాల్లో తలదూర్చని, తమ ఖజానాల్ని నింపుకోని వారు అరుదే. ఇక ఎన్‌జీవోలైతే తాము ఎందుకోసం ఏర్పర్చబడ్డాయో దానికి అనుగుణంగానే ఒక సేఫ్టీ వాల్వ్‌గా పని చేస్తూ, ప్రజలకు సంబంధించిన కొన్ని సిసలైన సమస్యలను ఎత్తి చూపుతున్నట్టుగా కనిపిస్తూనే, మన దేశంలోని రైతాంగానికి సంబంధించిన అత్యంత మౌలికమైన సమస్యను ముందుకు తేనివ్వకుండా వారు అడ్డం నిలుచుంటున్నారు. మరో మాటలో భూయాజమాన్యం సమస్య గురించీ, భూసంస్కరణల గురించీ వాళ్లు పూర్తి మౌనాన్ని వహిస్తున్నారు.

సిపిఐ (మావోయిస్టు) కేంద్రకమిటీ ఈ బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ దేశ ప్రజలందరూ ఐక్యంగా పోరాడాలనీ, భూకబ్జాలకూ, విస్థాపనకూ వ్యతిరేకంగా, జల్-జంగల్-జమీన్‌లపై తమ హక్కులకై పేద, మధ్యతరగతి, ధనిక రైతుల నుండి మొదలుకొని పట్టణ పేదలు, మధ్య తరగతి వరకు దీని వల్ల బాధితులయ్యే విశాల ప్రజానీకం అందరూ ఐక్యమై పోరాటాన్ని తీవ్రతరం చేయాలనీ పిలుపునిస్తోంది. సిసలైన భూసంస్కరణలు జరగకుండా భారతదేశంలో అభివృద్ధికి అర్థమే వుండదని అది మరోసారి స్పష్టం చేస్తోంది. భారతదేశం అర్ధ వలస-అర్ధ భూస్వామ్య దేశం. ఇక్కడ 70 శాతం ప్రజలు భూమిపై ఆధారపడి జీవిస్తారు. కానీ సిసలైన భూసంస్కరణలు అమలు జరపడానికి బదులుగా దోపిడీదారులు అభివృద్ధి పేరుతో రైతాంగం భూముల్ని అగ్గువకు లాక్కుని మతిపోయేన్ని లాభాలు దండుకుంటున్నారు. కోట్లాది పేద రైతాంగం, భూమిలేని పేదలు మరింత దరిద్రులుగా మారిపోతున్నారు. పెరుగుతున్న వారి ఆత్మహత్యలు జరుగుతున్న మరింత పెద్ద విషాదానికి ఒక ముఖ్యమైన సూచిక మాత్రమే.

మన దేశ వ్యవహారాల్లో, ముఖ్యంగా ఆర్థిక, రాజకీయ రంగాల్లో పెరుగుతున్న సామ్రాజ్యవాదుల, ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాదుల జోక్యం వల్ల, మన దేశాన్ని నయావలసగా మార్చే ప్రక్రియ సామ్రాజ్యవాద సైన్యాలు మన గడ్డ మీద అడుగుపెట్టకుండానే వేగవంతం అవుతోంది. ప్రత్యేక ఆర్థిక మండళ్లలో మన దేశ చట్టాలు పని చేయవు అనేది నామమాత్రంగా మిగిలి వున్న సార్వభౌమత్వాన్ని ఇప్పటికే హేళన చేసింది. మన దేశం వేర్వేరు ముసుగుల్లో మరింతగా నయావలసగా మారుతుండడంతో నూతన ప్రజాస్వామిక విప్లవంలో విడదీయరాని భాగంగా వుండే సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా జరిగే నిజమైన జాతీయ విప్లవం అవసరం మరింతగా పెరుగుతోంది. బడా భూస్వాములు ప్రయోజనాలు కూడా సామ్రాజ్యవాదుల, దళారీ నిరంకుశ బూర్జువాల ప్రయోజనాలతో విడదీయరాని విధంగా పెనవేసుకుని వున్నాయి. అందుకే మా పార్టీ కేంద్రకమిటీ మరోసారి స్పష్టంగా నూతన ప్రజాస్వామిక విప్లవానికి ఇరుసుగా వుండే వ్యవసాయ విప్లవం మాత్రమే ఈ ముగ్గురు ప్రజాశత్రువులను కూలదోసి దేశంలో సిసలైన భూసంస్కరణలకు దారి తీసి, దేశంలో సిసలైన ప్రజాస్వామ్యాన్నీ, స్వయం ప్రతిపత్తినీ, సార్వభౌమత్వాన్నీ నెలకొల్పి, ఈ వినాశనకరమైన భూకబ్జాలకు అంతం పలుకగల్గుతుంది అని ప్రకటిస్తోంది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ముసుగులో మన దేశంలో అధికారంలో వుంటూ దేశాన్ని సంపూర్ణంగా అమ్మివేస్తున్న సామ్రాజ్యవాద తొత్తులకూ, దేశద్రోహులకూ వ్యతిరేకంగా ఐక్యమై దీర్ఘకాలిక ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం, విస్తృతం చేస్తూ నూతన ప్రజాస్వామిక విప్లవ విజయానికై ముందుకు సాగాల్సిందిగా మా పార్టీ కేంద్రకమిటీ ప్రజలందరికీ పిలుపునిస్తోంది.



**(అభయ్)**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**